6 లక్షల ఫెంటానిల్ డ్రగ్ సీజ్

- హెరాయిన్ కంటే 50 రెట్లు, మార్ఫిన్ కంటే వందరెట్ల ప్రభావం
- అక్రమంగా విక్రయిస్తున్న డాక్టర్ దంపతులు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ)/బండ్లగూడ: మార్ఫిన్ కంటే వంద రెట్లు, హెరాయిన్ కంటే 50 రెట్లు అధికంగా ప్రభావం చూపే ఫెంటానిల్ అనే డ్రగ్‌ను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో పోలీసులు గురువారం సీజ్ చేశారు. రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోని ఆసిఫ్‌నగర్‌లో సుమారు రూ.6.08 లక్షల విలువైన 57 ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. సమీర్ హాస్పిటల్‌లో అనస్థీషీయా వైద్యుడు హన్సాన్ ముస్తఫాఖాన్ తన భార్య లుబ్నా నజీబ్‌ఖాన్‌తో కలిసి అక్రమంగా మత్తు మందులు విక్రయిస్తున్నాడు. ఈ ఫెంటానిల్ అనే సింథటిక్ డ్రగ్‌ను శస్త్రచికిత్సల సమయంలో, ఆపరేషన్ల తర్వాత తీవ్రమైన నొప్పులతో బాధపడే రోగులకు ఇస్తారు. డాక్టర్ దంపతులు అక్రమంగా ఈ డ్రగ్స్ విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టీఎస్ న్యాబ్ పోలీసులు నెలరోజులుగా వారిపై నిఘా పెట్టారు. గురువారం ఓ వినియోగదారుడు డాక్టర్ దంపతులకు ఒక బాక్స్ ఇంజెక్షన్ల కోసం రూ.17,500 డబ్బులు పంపడంతో డెలివరీ కోసం పోర్టర్ యాప్ బాయ్ రావడాన్ని గమనించిన హన్సాన్ ముస్తఫాఖాన్ భార్యతోపాటు డ్రగ్స్ బానిసైన ఓ వినియోగదారుడిని అరెస్టు చేశారు. వారి నుంచి 57 ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. కొద్దిరోజుల క్రితమే డాక్టర్ ముస్తఫా కువైట్ వెళ్లడంతో అతడి రాక కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. అతడు ఇప్పటి వరకు ఎవరెవరికీ డ్రగ్స్ అమ్మాడు? అతని ఖాతాలో ఎంతమంది వినియోగదారులు ఉన్నారు? అనే విషయాలు రాబట్టనున్నారు. మీ చుట్టుపక్కల ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నారని తెలిస్తే 8712671111 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని టీఎస్ న్యాబ్ పోలీసులు కోరారు.

బేస్‌బ్యాండ్ యూనిట్ల దొంగల ముఠా అరెస్టు

- ఏడుగురికి రిమాండ్.. పరారీలో మరో నలుగురు
- వివరాలు వెల్లడించిన మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, జనవరి18: ఎయిర్‌టెల్ సెల్ టవర్లలో బేస్‌బ్యాండ్ యూనిట్లను దొంగిలించి ఢిల్లీ, బంగ్లాదేశ్‌లలో విక్రయిస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి గురువారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. చేగుంట మండలం రామాంతపూర్, రాంపూర్‌లోని సెల్ టవర్ల వద్ద రూ.25 లక్షల విలువైన బేస్‌బ్యాండ్ యూనిట్లు చోరీకి గురయ్యాయని ఈ నెల 13న ఎయిర్‌టెల్ సెల్‌టవర్ పెట్రోలింగ్ ఉద్యోగి నాగరాజు చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కామారెడ్డి జిల్లాకు చెందిన మాసాని మహేశ్ ఎయిర్‌టెల్ బేస్‌బ్యాండ్ యూనిట్ల సప్లయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనితో కలిసి అదే జిల్లాకు చెందిన సంతోష్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రాజుగౌడ్ ఈ చోరీలకు పాల్పడుతున్నట్టు ఎస్పీ తెలిపారు. వీరి నుంచి హైదరాబాద్‌కు చెందిన మాసాని అనిల్, మహ్మద్ అఫ్రోజ్, కామారెడ్డికి చెందిన పాగిడిపల్లి అశోక్ బేస్‌బ్యాండ్ యూనిట్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఢిల్లీ, బంగ్లాదేశ్‌లలో విక్రయిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన మరో నలుగురు నిందితులు మాసాని బాగులు, మాసాని శేఖర్, మహ్మద్ అబ్బు, చాంద్‌లు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. నిందితులపై 26 కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితుల నుంచి రూ.6.75 లక్షల విలువ గల సామగ్రి, మూడు కార్లు, బైక్, ఏడు సెల్ ఫోన్లను రికవరీ చేసినట్టు ఎస్పీ తెలిపారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, రామాయంపేట సీఐ, చేగుంట, తూప్రాన్ ఎస్సై, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

భార్యను చంపిన భర్తకు ఉరిశిక్ష

- నాంపల్లి 4వ అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు

నాంపల్లి కోర్టులు, జనవరి 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని నాంపల్లి 4వ అదనపు జిల్లా కోర్టు గురువారం సంచలన తీర్పునిచ్చింది. 2019లో భార్యను చంపిన కేసులో భర్తకు ఉరిశిక్ష విధించింది. హైదరాబాద్‌లో ఒక నిందితుడికి ఉరిశిక్ష విధించడం ఇదే తొలిసారి. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భార్య నసీంఅక్తర్ (35)ను అదనపు కట్నం కోసం వేధించి భర్త ఇమ్రాన్ ఉల్‌హక్ చంపేశాడు. బావమరిది మహ్మద్ మజ్‌హీరుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 2019లో 302, 498-ఏ ఐపీసీ సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి సాక్ష్యాధారాలతోసహా చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే శ్రీవాణి వాదన, సాక్షుల వాంగ్మూలాలు విన్న కోర్టు నిందితుడిపై నేరం రుజువుకావడంతో ఉరిశిక్షను ఖరారు చేసింది. 498-ఏ కింద మూడేండ్ల జైలు శిక్ష, జరిమానాను విధించింది. హైకోర్టు ఆనుమతితో ఉరిశిక్షను అమలు చేస్తారు.

హత్య జరిగిందిలా..

2004లో నసీంఅక్తర్‌తో ఇమ్రాన్ ఉల్ హక్‌కు వివాహమైంది. ఐదేండ్లు వీరి కాపురం సాఫీగా సాగింది. వీరికి నలుగురు ఆడపిల్లలు పుట్టారు. నాలుగేండ్ల క్రితం నిందితుడు మైమోనా సుల్తానా అనే మరో మహిళను రెండో పెండ్లి చేసుకున్నాడు. నాటి నుంచి మొదటి భార్య నసీంఅక్తర్‌ను అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టాడు. కారు కొనేందుకు రూ.30 వేలు తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేసేవాడు. ఒకరోజు సుత్తితో ఆమె తలపై మోది, కత్తెర సాయంతో గొంతును కోసి, ప్రైవేటు భాగాల్లో స్క్రూడ్రైవర్ ప్రవేశపెట్టి హత్య చేశాడు. సుదీర్ఘ విచారణలో నిందితుడు ఇమ్రాన్ ఉల్‌హక్‌పై నేరం రుజువు కావడంతో కోర్టు ఉరిశిక్ష విధించింది. నలుగురు ఆడపిల్లలకు పరిహారం అందించాలని ఆదేశించింది.

2,100 కోసం స్క్రాప్ వ్యాపారి హత్య

- నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

మోత్కూరు, జనవరి 18: కేవలం రూ.2,100 కోసం పాత ఇనుప సామాను వ్యాపారిని హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌చార్జి డీసీపీ అరవింద్‌బాబు తెలిపారు. వివరాల్లోకెళ్తే.. సూర్యాపేట జిల్లా మోత్కూరు కు చెందిన ఎండీ ఖలీమొద్దీన్ (65) పాత ఇనుప సామాను వ్యాపారి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురంకు చెందిన సిరిపాటి కిరణ్ (32) మోత్కూరులో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 15న సంక్రాంతి రోజు మద్యం తాగేందుకు తన పాత ఇనుప సామానును ఖలీమొద్దీన్‌కు రూ.800కు అమ్మాడు. అదేరోజు సాయంత్రం ఖలీమొద్దీన్ ఇంట్లో వుండగా పారతో కొట్టి హత్య చేసి, రూ.2100తో పారిపోయాడు. విచారణ అనంతరం పోలీసులు కిరణ్‌ను అరెస్టు చేశారు.